

పాలకుర్తి: ఈరవెన్ను జెడ్పీఎస్ఎస్‌లో..



జనగామ రూరల్: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో..

ఘనంగా బాలల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థుల వేషధరణలు అలరించగా ఆటలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే పలు పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు.



తరిగొప్పుల: అంకుషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



జనగామ రూరల్: ఆశ్రమ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



జనగామ రూరల్: సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో..



లింగాలఘణపురం: వనపర్తి పాఠశాలలో..



బచ్చన్నపేట: వివిధ వేషధారణలో విద్యార్థులు

'నియోజకవర్గంపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి'

చిల్పూరు: నియోజకవర్గంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్‌రెడ్డికి, స్థానికురాలైన ఇందిరకు అవగాహన లేదని, అందుకే ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు భూక్య రమేష్ నాయక్ అధ్యక్షతన ఈ నెల 20వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు శివారులో నిర్వహించే సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం కోసం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కడియం శ్రీహరి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ సరితబాలరాజు, వైస్ ఎంపీపీ సరితనర్సింహ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, మాలోత్ రమేష్‌నాయక్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి,మాదాసి వెంకటేష్, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, రూప్లా నాయక్, అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

జనగామ నేతకు కామారెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలు

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జనగామ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డికి కామారెడ్డి నియోజకవర్గ బాధ్యతలను అప్పగిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు రాజిరెడ్డి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ, పార్టీలో అందరినీ సమన్వయం చేస్తూ, అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలన్నారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించి రేవంత్‌రెడ్డి గెలుపునకు పని చేస్తామన్నారు.



రాజిరెడ్డి

'కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమైన జనం'

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక పాలనతో విసుగుచెందిన జనం కాంగ్రెస్‌ను ఆదరించేందుకు సిద్ధమయ్యారని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమడూరులో బీఆర్‌ఎస్ నాయకుడు గొడిశాల వేణుతోపాటు పలువురు ఆమె సమక్షంలో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, గ్రామ అధ్యక్షుడు పురుషోత్తం పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డిని గెలిపించాలి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంగళవారం మండలంలోని బమ్మెరలో ఆలేటి ఎలమ్మ గుడిలో పూజలు నిర్వహించి గడప గడప ప్రచారాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారయణ ప్రారంభించారు. సర్పంచ్ నాగభూషణం, కొండ శ్రీను, ఎల్లయ్య, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

గెలుపొందగానే మన నీళ్లు మనకే..



జనగామ: మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: ప్రెస్టన్ మైదానంలో రేవంత్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొమ్మూరి

- కాళేశ్వరం నీళ్లు చుక్క రావడం లేదు
- కేసీఆర్ నోటివెంట పచ్చి అబద్ధాలు
- నేడు జనగామకు రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: జనగామ–చేర్యాల నీటిని సిద్దిపేట జిల్లా కొండపాక, సిద్దిపేటకు దొంగిలించుకు పోతున్నారు.. తాను ఎమ్మెల్యేగా గెలుపొందగానే, కాల్వలను మూసి వేయించి మన నీటిని మనకే అందించేలా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో తాను చేర్యాల ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత, ఈ ప్రాంతంలో రిజర్వాయర్లను నిర్మించే విధంగా కష్టపడి, సుమారు 80వేల ఎకరాలకు గోదావరి జలాలను అందించామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, తాము చేసినట్టుగా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కనీసం పిల్ల కాల్వల్లో కూరుకుపోయిన పూడిక తీయలేక పోయారని చెప్పారు. కాళేశ్వరం, మల్లన్న సాగర్ నుంచి మన ప్రాంతానికి సాగునీరు వస్తుందని సీఎం కేసీఆర్ అబద్ధాలు మాట్లాడడం ఆయన రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. రూ.లక్ష కోట్లతో నిర్మాణం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమ సంపాదన కేసీఆర్, మెఘా కృష్ణారెడ్డి ఇంట్లోకి వెళ్లాయని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సోనియమ్మ చలవతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంటే, కేసీఆర్ భూకబ్జాలు, మైనింగ్, ఇసుక, గనుల దందాలకు పాల్పడుతూ, ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను నిండా ముంచారని ఆరోపించారు. రెండు సార్లు మాయమాటలతో ఓట్లు వేయించుకున్న కేసీఆర్‌కు మూడో సారి ప్రజలు భారీ షాక్ ఇవ్వబోతున్నారని అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్, మెడికల్ కళాశాల నిర్మాణం ఇలా ఎన్నో సమస్యలను కాగితాలకు పరిమితం చేసి, ఓట్లు రాగానే మళ్లీ అధికారంలోకి వస్తే చేస్తామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి ఏం చేశాడని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న ఆయన, ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించాడా అని అన్నారు. ఒక్కరికి రెండు పదవులు బీఆర్‌ఎస్‌లోనే సాధ్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో విద్యాసంస్థల కోసం సొంత ఖర్చులు భరించి 12 ఎకరాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తన హయాంలో ప్రజలకు సేవ చేయడం తప్ప, అవినీతి, ఆరోపణలు ఉండవన్నారు. నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం భూములను కాపాడుకుంటూ వస్తే, సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత అమ్ముకుంటూ వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను అమలు చేస్తామని, చేతి గుర్తుకు ఓటు వేసి సోనియమ్మ రుణం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, ఉద్యోగులకు ఒకటో తారీఖునే వేతనాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమల్ల సత్యనారా యణ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కరుణాకర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వంగా ల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్ రెడ్డి, శివరాజ్ యాదవ్, బుచ్చిరెడ్డి, నర్సింగరావు తదితరులు ఉన్నారు.



జనగామ: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కొమ్మూరి కోడలు దివ్య

జనగామలో గడప గడపకు ప్రచారం..

జనగామ పట్టణం 11, 12, 22, 24వ వార్డు ఏరియాలో యువనాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, ఆయన సతీమణి దివ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం తదితరుల ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు జాయ మల్లేశం, బూడిద చిన్నగౌడ్, సోమయ్య, శ్రీనివాస్, మహేష్, శ్రీశైలం ఉన్నారు. రేవంత్‌రెడ్డి సభకు ఆహ్వానిస్తూ 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత వేణు మాధవ్ ఆధ్వర్యంలో బడికె ఇందిర, వంగాల కల్యాణి, సుంకరి నిర్మల, ముని బేగం, సుజాత తదితరులు ప్రచారం చేశారు.



కొమురవెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అరుణ

నేడు రేవంత్‌రెడ్డి రాక..

ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు (బుధవారం) టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రానికి రాబోతున్నరని కొమ్మూరి తెలిపారు. హనుమకొండ రోడ్డు ప్రెస్టన్ మైదానంలో జరిగే సభకు మధ్యాహ్నం 2 గంటలకు రేవంత్ చేరుకుంటారన్నారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి లక్ష మంది సొంత ఖర్చులు భరించి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అంతకు ముందు రేవంత్ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి అరుణ మండల నాయకులతో కలసి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, కనకరాజు, గ్రామ అధ్యక్షుడు పోతుగంటి రవి, గొల్లపల్లి శ్రీనివాస్, ఎక్కల దేవి శ్రీనివాస్, స్వాముల పల్లి శ్రీనివాస్, రమేష్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో, అలాగే గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా



బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లిలో ఓట్లు అడుగుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బచ్చన్నపేట: పల్లాకు మంగళహారతి పడుతున్న మహిళ

- సీఎం కుటుంబంలో నేనొక్కరిని
- రుణమాఫీ, వడగళ్ల సాయం రాకుండా ఉత్తమ్ కుమార్‌రెడ్డి అడ్డుకున్నారు
- ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా

బచ్చన్నపేట/జనగామ: సీఎం కుటుంబంలో నేనొక్కరిని.. జనగామ ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, నక్కవానిగూడెం, నారాయణపురం గ్రామాల్లో గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. ఊరూరా పల్లాకు ఒగ్గుడోలు చప్పుళ్లు, బతుకమ్మ ఆటలు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు గ్రామాల్లోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత వాసిగా, నియోజకవర్గంలోని 131 గ్రామాల స్థితిగతులను అర్థం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఎక్కడకు వెళ్లినా ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తున్నారని, వాటిని రికార్డు చేసుకుని, ఎమ్మెల్యేగా గెలిపించగానే మొదటగా తన సొంత నిధులతో పూర్తి చేయిస్తానని తెలిపారు. ప్రజలు పని చేస్తారనే నమ్మకం ఉన్న నాయకుడికే సమస్యలు చెప్పుకుంటారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన కుటుంబ సభ్యుడు, ఆశీర్వదించండి, అన్ని రకాలుగా అండగా నిలుస్తామని జనగామ సభలో స్వయంగా కేసీఆర్ చెప్పిన మాటలు ఊరూరా ప్రజలకు తెలియజేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతురుణ మాఫీ, వడగళ్ల పంట నష్టపరిహారం ఇచ్చేందుకు సిద్ధమైన తరుణంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపించారన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో ఆ నగదును జమ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని అన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందడానికి సీఎం కేసీఆర్ దూతగా తనను పంపించారని, నిత్యం ఇక్కడే అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తానని తెలిపారు.



చేర్యాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపారాణి



జనగామ: 22వ వార్డులోని ఆలయంలో పూజ చేస్తున్న పల్లా సతీమణి నీలిమ తదితరులు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బచ్చన్నపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సందీప్ ఆధ్వర్యంలో పలువురు యూత్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పల్లా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఆయా గ్రామాల్లో సైతం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జనగామ పట్టణంలో..

జనగామ పట్టణంలోని 22వ వార్డులో పల్లా సతీమణి నీలిమ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా ప్రచారం చేశారు. ఆమెకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహా హైదరాబాద్‌తో పోటీ పడేవిధంగా జనగామ అభివృద్ధి చెందాలంటే పల్లా కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 21వ వార్డులో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, మంగ రామకృష్ణ, చిర్ర బీరయ్య, బాల్దె వెంకటేశం, సిద్దులు, చిన్నం రాజు. రాజబోయిన శ్రీశైలం ఇంటింటా ప్రచారం చేపట్టారు.

పల్లా గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారం, వల్లంపట్ల, రేబర్తి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పుట్ట వెంకట రమణారెడ్డి, సూర్ణ ఐలయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు మద్దతుగా ప్రచారం

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలో నాయకుడు సార్ల కిష్టయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులు, కొండ శ్రీధర్, లింగం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లాను గెలిపించాలి

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాడూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిపాల్‌రెడ్డి, రాజేష్ లక్ష్మణ్, ఐలయ్య, కనకయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలో..

మున్సిపల్ పరిధిలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి పాల్గొన్నారు. మహిళలకు బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలాగే 5వ వార్డులో కౌన్సిలర్ ఆడెపు నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో కారు గుర్తుకు ఓటు వేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, తిరుపతి, సాయికిరణ్, రాజు, సుభాష్, మహేష్, నర్సింహ, నందిని, వినయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బోరుమోటారు అందజేత

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట పంచాయతీ పరిధిలోని సయ్యద్‌హుస్సేన్‌పల్లి వాసులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని కాలనీ వాసులు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ. లక్ష విలువైన బోర్‌మోటారును అందించడంతో పాటు మంగళవారం ప్రారంభించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

కలిసికట్టుగా పనిచేయండి

రఘునాథపల్లి: స్టేషన్‌ఘన్‌పూర్‌లో గులాబీ జెండా ఎగరనుందని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం జనగామ మండలం యశ్వంతాపూర్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో రఘునాథపల్లి మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించనున్న సీఎం ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు మారుజోడు రాంబాబు, జెడ్పీటీసీ బొల్లం అజయ్ కుమార్‌గౌడ్, పోకల శివకుమార్, బొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

కడియం శ్రీహరికి ఆర్యవైశ్య సంఘం మద్దతు

రఘునాథపల్లి: ఊరూరా తిరిగి భారీ మెజార్టీతో గెలిపిస్తామని మండల ఆర్యవైశ్య, పట్టణ ఆర్యవైశ్య సంఘాలు బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. మంగళవారం జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్, మండల, పట్టణ అర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గందె వీరయ్య, కూరెళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో శ్రీహరితో సమావేశమై మద్దతు ప్రకటించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువత, అన్ని సామాజిక వర్గాల ప్రజలు చైతన్యం కావాలని, దగాకోరు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు తమ ఓట్ల ద్వారా గుణపాఠం చెప్పాలని కొత్తపల్లి మాజీ సర్పంచ్ కీసర ముత్యంరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కూతురు మన్వితరెడ్డి టీఎస్‌పీఎస్‌సీ 2022 గ్రూప్–1 ఆస్పిరెంట్‌యని, కూలి పనిచేసి కుమార్తెను చదివించాన్నారు. మెరిట్ విద్యార్థిని అయిన తన కుమార్తె డిప్యూటీ కలెక్టర్ అవుతుందనుకుంటే నమ్మకం ఉందేదని, అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి కేటీఆర్, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ప్రశ్నాపత్రాలు అమ్ముకున్నారని విమర్శించారు.

జవహర్ లాల్ నెహ్రూకు నివాళి



జనగామ: మొదటి ప్రధాని, దివంగత పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి.. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చారబుడ్ల దయాకర్ రెడ్డి, జిల్లెల్ల సిద్దారెడ్డి, గంగం నర్సింహ రెడ్డి, బనుక శివరాజ్ యాదవ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు

బచ్చన్నపేట: విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఆలింపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు గుండని జంపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో తన వ్యవసాయ బావి వద్ద పక్క రైతువరి పొలంలో కరెంట్ షాట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగగా అవి తన పొలంలోకి రాకుండా ఆర్పే క్రమంలో జంపయ్యకు సర్వీస్ వైరు తగిలి కరెంట్ షాక్‌తో ఛాతీ, చేయి, వీపు తీవ్రంగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఎంపీటీసీ మసూద్ అక్కడకు చేరుకొని జంపయ్యను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ మసూద్ వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రయాణిస్తూనే అన్నం తిన్న మంత్రి



పాలకుర్తి: మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ యువకులు పలు వేషధారణలో మంళవారం తొర్రూరులో జరిగిన సీఎం ఆశీర్వాద సభకు తరలివెళ్లారు. ఈక్రమంలో నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లికి అన్నం తినిపించారు. మండల అధ్యక్షుడు నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు యాకాంతరావుల ఆధ్వర్యంలో వాహనాల ద్వార నాయకులు, కార్యకర్తలు తొర్రూరుకు తరలి వెళ్లారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని రామరాజుపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడు లేగ రామిరెడ్డి మృతి చెందాడు. కాగా, మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కడియంకు ఓట్లడిగే హక్కు లేదు..

రఘునాథపల్లి: జై తెలంగాణ అన్నోళ్లను పోలీసులతో కొట్టించిన కడియం శ్రీహరికి ఎన్నికల్లో ఓట్లడిగే హక్కులేదని బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి గుండె విజయరామారావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు.

'రేవంత్‌రెడ్డి, ఇందిర ఇద్దరూ తోడుదొంగలే'



స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర ఇద్దరూ తోడు దొంగలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం జఫర్‌గఢ్ మండల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు కూడా లేదని, రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్నాడని, ఇందిర చీటింగ్ కేసులో ఉందని, ఆమెపై చీటింగ్ కేసు సుప్రీంకోర్టులో నడుస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, మాదాసు వెంకటేష్, జఫర్‌గఢ్ జెడ్పీటీసీ ఇల్లందుల బేబీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



దేవరుప్పుల: ఉన్నత విద్యలో రాణిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదుగాలని ఫాదర్ దీలీఫ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్, ఖాజా, కృష్ణ, విజయలక్ష్మి, మాధవి, అనిత, సరిత, నిర్మల, రజియా పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కడియం కుమార్తెలు కావ్య, దివ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి మంగళవారం ఇంటిటా ప్రచారాన్ని నిర్వహించారు.

సిలిండర్‌లో మంటలు

ముగ్గురికి స్వల్ప గాయాలు



లింగాలఘణపురం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కేమిడి దేవయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్‌లో మంటలు చెలరేగి ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాల య్యాయి. దీపావళి పండుగ సందర్భంగా ఇంట్లో పిండి వంటల కోసం గ్యాస్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో ఇంట్లో ఉన్న యాదగిరి, స్వప్న, సిద్దలక్ష్మికి స్వల్ప గాయాలై భయాందోళనకు గురయ్యారు. దీంతో సమీపంలో ఉన్న రేగు రవి అనే యువకుడు ఇంట్లో నుంచి మండుతున్న సిలిండర్‌ను బయట పడవేయగా సుమారు అరగంటలకు పైగా మంటలు చెలరేగాయి. మంటల తీవ్రత తగ్గేంత వరకు వేచి చూసి మంటలను ఆర్పారు. అదృష్టవశాత్తు సిలిండర్ పేలకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.